క్లుప్తంగా

కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

బోధన్: ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సోమవారం కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే షకీల్ సతీమణి అయేషా ఫాతిమా, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు పంపిణీ చేశారు. 80 మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేసినట్లు నాయకులు తెలిపారు. ఎంపీపీ బుద్దె సావిత్రి , ఏఎంసీ చైర్మన్ వీఆర్ దేశాయ్, వైస్ చైర్మన్ ఎండీ షకీల్ పాల్గొన్నారు.

మాక్లూర్‌లో..

మాక్లూర్: లబ్ధిదారులకు మంజూరైన 132 కల్యాణలక్ష్మి చెక్కులను ఎంపీపీ మాస్త ప్రభాకర్ పంపిణీ చేశారు సోమవారం మండల కేంద్రంలోని ఎంపీపీ చాంబర్‌లో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బడుగు సత్యం ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక సమావేశానికి తహసీల్దార్ శంకర్, ఎంపీడీవో క్రాంతి హాజరయ్యారు. వారి సమక్షంలో చెక్కులను అందజేశారు. కార్పొరేటర్ రాజాసింగ్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు..

బాల్కొండ: ముప్కాల్ మండలం వేంపల్లి గ్రామానికి చెందిన నలుగురు లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు కావడంతో వారికి సోమవారం సంబంధించిన చెక్కులను అందజేశారు. బీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు మల్లారి గంగాధర్, ఉప సర్పంచ్ జక్క గంగాధర్, జక్క రాజేశ్వర్ పాల్గొన్నారు.

దుప్పట్లు..



కోటగిరి : అమ్మా నాన్న సేవా ట్రస్ట్ 13వ వార్షికోత్సవం సందర్భంగా కోటగిరి మండలంలోని కొత్తపల్లిలో పేద వయో వృద్ధులకు సోమవారం దుప్పట్లు పంపిణీ చేశారు. చలి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని 35 మంది పేదలకు ఈ చేయూత నందించినట్లు ట్రస్ట్ ఫౌండర్ ఏలూరి శ్రీనివాసరావు(వాసు బాబు) పేర్కొన్నారు. సర్పంచ్ అశోక్ రెడ్డిపాల్గొన్నారు.

బాల్కొండ జీపీలో గ్రామ సభ

బాల్కొండ: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీలో ఈజీఎస్ సోషల్ ఆడిట్‌పై సోమవారం సర్పంచ్ బుస సునీత అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. ఉపాధి హామీ పథకంలో మూడు సంవత్సరాల నుంచి నిర్వహించిన ఆడిట్‌పై సభలో ఎస్ఆర్పీ సుధాకర్ చదివి వినిపించారు. సమావేశంలో ఎంపీడీవో సంతోష్‌కుమార్, ఏపీవో ఇందిర, ఉప సర్పంచ్ వాహబ్, పంచాయతీ కార్యదర్శి నర్సయ్య, డీఆర్పీలు, వీఎస్ఏలు, పాల్గొన్నారు.

కలెక్టర్‌కు ఆహ్వానం

నందిపేట్(ఆర్మూర్): కేదారీశ్వర ఆశ్రమంలో జరిగే అఖిలాంధ్ర సాధు పరిషత్తు 57వ వార్షిక మహాసభల ఆహ్వాన పత్రికలను సోమవారం జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డితో పాటు పోలీస్ కమీషనర్ కేఆర్ నాగరాజ్‌లకు ఆశ్రమ వ్యవస్థాపకులు మంగిరాములు మహారాజ్ అందజేశారు. ఈ నెల 27 నుంచి ఫిబ్రవరి 1 వరకు జరిగే సాధు పరిషత్తు మహాసభలలో దేశ నలుమూలల నుంచి జగద్గురువులు, పీఠాధిపతులు పాల్గొంటారని మంగిరాములు వారికి వివరించారు. పాల్గొని సహకరించాలని జిల్లా కలెక్టర్, సీపీలకు కోరారు.

విద్యాసంస్థల బంద్



బాల్కొండ: సరస్వతి అమ్మవారిపై రెంజర్ల రాజేశ్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా సోమవారం బాల్కొండ మండల కేంద్రంలో ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థలను వీడీసీ, వీహెచ్‌పీ ఆధ్వర్యంలో బంద్ చేశారు. అనంతరం విద్యార్థులతో బాల్కొండ ఠాణా వరకు ర్యాలీ నిర్వహించారు. హిందువుల మనోభావాలు దెబ్బతినేలా వ్యాఖ్యలు చేసిన రాజేశ్‌పై వెంటనే పీడీ యాక్టు నమోదు చేయాలని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

జీవో విడుదల చేయండి

కమ్మర్‌పల్లి: సెర్ప్ ఉద్యోగులకు సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు పేస్కేల్ ఫైల్ ప్రాసెస్ చేసి జీవో విడుదల చేయాలని సెర్ప్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుంట గంగాధర్ రెడ్డి, మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు విన్నవించారు. సోమవారం హైదరాబాద్‌లో మంత్రి ఎర్రబెల్లిని ఉద్యోగ సంఘం నాయకులు కలిశారు. అనంతరం ఉద్యోగ సంఘం క్యాలెండర్‌ను మంత్రి ఆవిష్కరించారు.ఉద్యోగులకు ఇచ్చిన మాటకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పెండింగ్ సమస్యల పరిష్కారానికి అధికారులతో సంప్రదింపులు నిర్వహిస్తామని మంత్రి వెల్లడించారని కుంట గంగాధర్ తెలిపారు.

హనుమాన్ ఆలయ సందర్శన

రుద్రూర్: బొప్పాపూర్‌లో పునర్నిర్మాణం చేస్తున్న హనుమాన్ ఆలయాన్ని సోమవారం హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామి సందర్శించారు. స్వామికి మంగళ హారతులతో మహిళలు స్వాగతం పలికారు. వచ్చే నెల పనులు పూర్తి చేసి ఆలయాన్ని ప్రారంభించనున్నారు. ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి రావాల్సిందిగా స్వామిని ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానించారు.

శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించాలి

- బోధన్ ఆర్డీవో ఆఫీసు ఎదుట హిందూ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ధర్నా
- ఆర్డీవో రాజేశ్వర్‌కు వినతి పత్రం అందజేత



ఆర్డీవో రాజేశ్వర్‌కు వినతి పత్రం అందిస్తూ..



ధర్నా నిర్వహిస్తున్న హిందూ సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు

బోధన్: హిందువుల ఆరాధ్యదైవం ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని వెంటనే ఆవిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం పట్టణ కేంద్రంలోని ఆర్డీవో ఆఫీసు ఎదుట హిందు సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీవో రాజేశ్వర్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో పది నెలల క్రితం శివాజీ విగ్రహాన్ని నెలకొల్పిన సందర్భంగా ఏర్పడిన వివాదం కారణంగా ఆవిష్కరణ నిలిచిపోయిందని పేర్కొన్నారు. శాంతియుత వాతావరణంలో అన్ని వర్గాలను కలుపుకుని విగ్రహావిష్కరణ చేస్తామని చెప్పి నెలలు గడిచినా అలాగే ఉండిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం, అనుమతి ఉన్నా విగ్రహావిష్కరణకు నోచుకోలేదని, మరో మైనార్టీ సామాజిక వర్గ ప్రార్థనా మందిరాలు అనుమతి లేకుండా నిర్మించినా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని పేర్కొన్నారు. వారం పది రోజుల్లో సానుకూల నిర్ణయం తీసుకుని విగ్రహావిష్కరణకు చర్యలు తీసుకోవాలని కోరారు. వేదిక ప్రతినిధులు రామరాజు, సుధాకర్‌చారి, బాల్‌రాజ్, హరిక్రిష్ణ, అశోక్‌గౌడ్, దీపక్, కౌన్సిలర్ వినోద్, రెంజల్ ఎంపీపీ మేక విజయ సంతోష్, నాయకులు పాల్గొన్నారు.

కొత్త నమూనాతో విద్యార్థుల్లో ఆందోళన



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ నేత రామకృష్ణ

ఆర్మూర్‌టౌన్: పదవ తరగతి పరీక్ష ప్రశ్నా పత్రాల్లో 11 ప్రశ్నలు పెంచి, సమయం 15 నిమిషాలు ఇవ్వడంపై విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారని పీడీఎస్‌యూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శి రామకృష్ణ, ఆజాద్‌లు అన్నారు. పట్టణంలో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రశ్నా పత్రంలో 33 శాతం ఛాయిస్ ప్రశ్నలతో పరీక్షల షెడ్యూల్‌ను సవరించి ప్రతి పరీక్షకు ఒక రోజు గడువు ఇవ్వాలన్నారు. 2019లో నిర్వహించిన పరీక్షల మాదిరిగా ఎస్ఎస్‌సీ పరీక్షలు నిర్వహించాలన్నారు. ఈ విషయమై ఈనెల 10న ఎంఈవోలకు, 11న జిల్లా విద్యాశాఖ అధికారికి వినతి పత్రం అందజేయనున్నట్లు వారు పేర్కొన్నారు. పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు సరేందర్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు

బోధన్: ప్రత్యేక జిల్లా ఏర్పాటు డిమాండ్‌తో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణ కేంద్రంలోని కోర్టు ఎదుట న్యాయవాదులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 22వ రోజుకు చేరాయి. దీక్షలో అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎం.గంగారెడ్డి, న్యాయవాది శంకర్, విద్యార్థి జేఏసీ ప్రతినిధి శివకుమార్‌లు కూర్చున్నారు. సీనియర్ న్యాయవాదులు మారుతిరావు ఖన్నా, దత్తాత్రిరావులు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలను పనిలో పెట్టుకోవద్దు



రుద్రూర్: బడి ఈడు పిల్లలను పనిలో పెట్టుకోవద్దని చందూర్ మండల సీఆర్‌పీ సాయిలు సూచించారు. సర్వశిక్ష అభియాన్ అధికారుల ఆదేశాల మేరకు సోమవారం చందూర్ మండలంలో బడి పిల్లల కోసం సర్వే నిర్వహించారు. మహారాష్ట్ర నుంచి వచ్చి ఇటుక బట్టీల్లో పని చేస్తున్న కుటుంబాల బడి ఈడు పిల్లలను గుర్తించారు. వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. త్వరలో సమీపంలో ఉన్న పాఠశాలల్లో చేర్పిస్తామని, వారి నుంచి హామీ తీసుకున్నారు. బడి వయస్సు ఉన్న పిల్లలను అందరూ పాఠశాలలకు పంపించాలని సాయిలు కోరారు.

'ఇందూర్'లో సంక్రాంతి సంబరాలు



హరిదాసులతో మున్సిపల్ చైర్ పర్సన్, ఎమ్మెల్యే సతీమణి, పాఠశాల కరస్పాండెంట్ కిశోర్ కుమార్

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని ఇందూర్ ప్రైమరీ పాఠశాలలో సోమవారం సంక్రాంతి సంబరాలను వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే షకీల్ సతీమణి అయేషా ఫాతిమా, మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మాశరత్ రెడ్డిలు హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో గ్రామీణ వాతారణం ఏర్పాటు చేశారు. భోగి మంటలు వేసి పండుగ సంబురాల కార్యక్రమాన్ని అతిథులు ప్రారంభించారు. బొమ్మల కొలువులు ఏర్పాటు చేసి పిల్లలకు భోగి పళ్లు పోశారు. రంగులతో ముగ్గులు వేసి గొబ్బెమ్మలను పెట్టారు. పొంగలిని వండి వడ్డించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ వీఆర్ దేశాయ్, పాఠశాల కరస్పాండెంట్ కొడాలి కిశోర్ కుమార్, ప్రధానోపాధ్యాయులు సుధారాణి, తదితరులు పాల్గొన్నారు.

రెంజల్‌లో ముగ్గుల పోటీలు

రెంజల్(బోధన్): మతాలకు అతీతంగా గంగాజమున తహజీబ్‌లా హిందూ, ముస్లిం మహిళలు, యువతులు ముగ్గుల పోటీల్లో పాల్గొనడం అభినందనీయమని ఎమ్మెల్యే సతీమణి అయేషా ఫాతిమా అన్నారు. సంక్రాంతి పండగ సందర్భంగా రెంజల్, కందకుర్తి గ్రామాల్లో సోమవారం ముగ్గుల పోటీలను ఆమె ప్రారంభించి, విజేతలకు బహుమతులను అందించారు. సర్పంచ్‌లు మల్ల రమేశ్‌కుమార్, ఖలీంబేగ్, ఎఖార్‌పాష, వాణీ, ఎంపీటీసీలు అజ్మతున్నీసా బేగం, అసద్‌బేగ్, గంగలత, స్వప్న, విండో చైర్మెన్‌లు ఇమాంబేగ్, భూంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీడీ కార్మికులకు ఆటల పోటీలు

నందిపేట్(ఆర్మూర్): మండల కేంద్రంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సోమవారం బీడీ ప్యాకర్లు, టేకేదారులకు ఆటల పోటీలు నిర్వహించారు. కుర్చీ పోటీలలో 30 మంది పాల్గొనగా ముగ్గురు విజేతలుగా నిలిచారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ప్రజాసంఘాల జిల్లా నాయకులు గంగాధర్, బాల్‌రాజ్, మల్లేష్, సయ్యద్ పాల్గొన్నారు.

'ఆరోగ్య ఉపకేంద్రం' నిర్మాణానికి భూమి పూజ

బోధన్: హున్సలో ఆరోగ్య ఉప కేంద్రం నూతన భవన నిర్మాణానికి జాతీయ ఆరోగ్య పథకం కింద రూ.20 లక్షలు నిధులు మంజూరయ్యాయి. సోమవారం గ్రామంలో ఆరోగ్య ఉప కేంద్రం నూతన భవన నిర్మాణ పనులకు గ్రామ సర్పంచ్ చీల గంగామణి గంగారాం భూమి పూజ చేశారు. ఈ ఆరోగ్య ఉప కేంద్రం ద్వారా హున్స, మందర్న, ఖాజాపూర్ గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్య సౌకర్యం అందుబాటులోకి వస్తుందని గ్రామ సర్పంచ్‌లు తెలిపారు. స్థానిక బీఆర్ఎస్ నాయకుడు జక్క సంజీవ్ పటేల్ తన తండ్రి స్మారకార్థం భవన నిర్మాణానికి స్థలం ఇచ్చారని పేర్కొన్నారు. ఎంపీటీసీ శివశంకర్, మందర్న సర్పంచ్ గంగాధర్ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులను పునరుద్ధరించండి

- సర్వసభ్య సమావేశంలో సభ్యులు



మాట్లాడుతున్న ఎంపీపీ కొండెంగల శ్రీనివాస్

ఎడపల్లి(బోధన్): మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ కొండెంగల శ్రీనివాస్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ శ్రీనివాస్, జెడ్పీ వైస్ చైర్ పర్సన్ రజిత యాదవ్‌లు మాట్లాడుతూ.. అంబం(వై) మీదుగా నడిచే బస్సు రద్దు చేశారని, వెంటనే బస్సు పునరుద్ధరించాలని ఆర్టీసీ అధికారిని కోరారు. మంగల్‌పాడ్ మీదుగా కుర్నాపల్లి, ఠాణాకలాన్, జానకంపేట్, నిజామాబాద్‌కు నడిచే బోధన్ డిపో బస్సు రద్దు చేశారని, వెంటనే ఆ బస్సును కూడా పునరుద్ధరించాలని కోరారు. మండలంలో ఎన్ని చెరువులకు చేప పిల్లలు పంపిణీ చేస్తున్నారనే లెక్క తెలియడం లేదని, ఈ విషయంలో సరైన సమాచారం ఇవ్వడం లేదని మత్స్యశాఖ అధికారులను నిలదీశారు.

దత్తత గ్రామంగా జైతాపూర్

విద్యుత్ శాఖ ఏఈ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ.. జైతాపూర్‌ను దత్తత గ్రామంగా ఎంపిక చేశామని తెలిపారు. గృహ విద్యుత్ కొత్త కనెక్షన్‌ల కోసం అవసరమున్న వినియోగదారులు నేరుగా మీ–సేవలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మిషన్ భగీరథ ఏఈ గబ్బర్ సింగ్ సభ్యులనుద్దేశించి మాట్లాడుతుండగా.. ఎడపల్లి ఎంపీటీసీ నాయిడి స్రవంతి లేచి గ్రామంలో మిషన్ భగీరథ నీరు ప్రజలకు అందడం లేదని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. జానకంపేట్ ఎంపీటీసీ మంద సంజీవ్ మాట్లాడుతూ.. జానకంపేట్ గ్రామంలోని 1వ వార్డులో భగీరథ నీళ్లు రావడం లేదని అధికారుల దృష్టికి తెచ్చారు. తాగు నీరు, మిషన్ భగీరథ నీరు ప్రజలందరికి అందిస్తామని ఏఈగబ్బర్ సింగ్ సభ్యులకు తెలిపారు. సమావేశంలో పలు సమస్యలు ప్రస్తావనకు వచ్చాయి. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఇమ్రాన్ ఖాన్, ఎంపీడీవో గోపాల కృష్ణ, తహసీల్దార్ ఆకుల శేఖర్, వైద్యాధికారి రాజ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కోటి సంతకాల సేకరణ

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని అంబేడ్కర్‌చౌరస్తా వద్ద డాక్టర్ విశారదన్ 10 వేల కిలోమీటర్ల స్వరాజ్య పాదయాత్రకి మద్దతుగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపడుతున్నట్లు దళితశక్తి ప్రోగ్రాం రాష్ట్ర కార్యదర్శి ప్రేమ్ తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సంతకాల సేకరణ చేపట్టారు. జిల్లా కో–ఆర్డినేటర్ నాగేశ్వర్‌గరావు పాల్గొన్నారు.

అరుణోదయ సుబ్బారావుకు నివాళులు

ఆర్మూర్: పట్టణంలో ప్రగతిశీల మహిళ సంఘం ఆధ్వర్యంలో సోమవారం కామ్రేడ్ అరుణోదయ సుబ్బారావుకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. పీవోడబ్ల్యూ నేత శిరోమణి, కల్పన పాల్గొన్నారు.

వీడీసీ నూతన కార్యవర్గం

కమ్మర్‌పల్లి: చౌట్‌పల్లి గ్రామాభివృద్ధి కమిటీ(వీడీసీ) అధ్యక్షుడిగా తోట శ్రీధర్ ఎన్నికయ్యారు. సోమవారం గ్రామాభివృద్ధి కమిటీ నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. ఉపాధ్యక్షుడిగా సింగరి ఆనంద్, ప్రధాన కార్యదర్శిగా పెద్ది సత్యనారాయణ, కోశాధికారిగా యెల్మ గంగాధర్, సభ్యులుగా రాజేశ్వర్, జైపాల్, సురేందర్‌లను ఎన్నుకున్నారు.

వరిలో 'ఉల్లికోడు' గుర్తింపు

రుద్రూర్: రుద్రూర్, వర్ని మండలాల్లో రైతులు సాగు చేస్తున్న వరి పంట పొలాలను సోమవారం వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు సాయిచరణ్, దినేష్ సందర్శించారు. వరికి ఉల్లికోడు ఆశించినట్టు గుర్తించారు. కీటక శాస్త్రవేత్త సాయిచరణ్ మాట్లాడుతూ..ఉల్లి కోడును దుంప రోగం, గొట్టను రోగం అంటారని పేర్కొన్నారు. ఈ పురుగు నారుమడి దశ నుంచి పంటను ఆశించి నష్టపరుస్తుందన్నారు. మొక్క అంకురం ఉల్లి కాడలాగా లేత ఆకు పచ్చని పొగగొట్టం గొట్టం లాగా మార్పు చెందుతుందన్నారు. నారును ఆలస్యంగా నాట్లు వేసినపుడు, గాలిలో తేమ శాతం అధికంగా ఉన్నప్పుడు ఈ పురుగు ఉధృతి అధికంగా ఉంటుందన్నారు. నివారణకు నారు మెలకెత్తిన 10–15 రోజుల లోపు కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు వేసుకోవాలన్నారు. నాట్లు వేసిన తర్వాత 10–15 రోజుల్లో కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు 10 కిలోలు లేదా ఫిప్రానిల్ 0.3జీ గుళికలు 10 కిలోలు ఎకరాకు వేసుకోవాలని సూచించారు. అలాగే ఫిప్రానిల్ 5 శాతం ఎస్‌సీని 2.5మి.లీ లీటర్ నీటికి కలిపి వారం వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలని వివరించారు.

బకాయిలు విడుదల చేయాలి

పెర్కిట్(ఆర్మూర్): విద్యార్థులకు చెల్లించాల్సిన రూ.3 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాటికొండ రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆర్మూర్ పట్టణంలో సోమవారం రవి మాట్లాడారు. ప్రభుత్వ వైఖరి కారణంగా ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ఆధారపడి చదువుకుంటున్న విద్యార్థుల్లో నిరాశ నెలకొందన్నారు. అలాగే నూతన జాతీయ విద్యా విధానాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రగతి భవన్ ముట్టడికి వెళ్తున్న ఎస్ఎఫ్ఐ నాయకుల ముందస్తు అరెస్టులను ఈ సందర్భంగా ఖండించారు.

అట్రాసిటీ యాక్ట్‌ను దుర్వినియోగం చేయొద్దు

- రుద్రూర్ తహసీల్ వద్ద దళిత, బహుజన నాయకుల ఆందోళన



రుద్రూర్: ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ యాక్ట్‌ను స్వప్రయోజనాల కోసం ఉపయోగించుకోవద్దని దళిత, మహిళ, బహుజన నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం రుద్రూర్ తహసీల్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇటీవల కోటగిరి హైస్కూల్‌లో తెలుగు ఉపాధ్యాయుడు, హిందుత్వవాదుల మధ్య ఘటన జరిగినపుడు పోలీసులు, నాయకులు అక్కడికి వచ్చారు. కులం పేరు ప్రస్తావన రాకుండానే కులం పేరుతో దూషించినట్లు ఫిర్యాదు చేయడం సమంజసం కాదన్నారు. అట్రాసిటీ యాక్టును దుర్వినియోగం చేస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. ఆందోళనలో దళిత, బహుజన నాయకులు అశోక్ కాంబ్లె, కుర్మాజీ సాయిలు, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుతో ఆదాయం



మాట్లాడుతున్న ఏడీఏ మల్లయ్య

కమ్మర్‌పల్లి : ఆయిల్ పామ్ సాగుతో రైతులకు మంచి ఆదాయం లభిస్తుందని భీమ్‌గల్ ఏడీఏ మల్లయ్య అన్నారు. సోమవారం కమ్మర్‌పల్లి రైతు వేదిక భవనంలో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులతో ఆయిల్ పామ్ సాగుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయిల్ పామ్ సాగు కోసం ప్రభుత్వం అధిక మొత్తంలో రాయితీలు కల్పిస్తోందని వివరించారు. ఒక మొక్క రాయితీ పోను రూ.20కే అందిస్తుందన్నారు. ఎకరానికి 57 మొక్కలు అవసరం కాగా రూ. 1140 డీడీ రూపంలో చెల్లించాలన్నారు. మొక్కలు నాటిన నుంచి 4 సంవత్సరాల పాటు ఎకరానికి పంట ఖర్చుల కోసం రూ.2100తో పాటు అంతర పంటల సాగుకు ఎకరానికి మరో రూ.2100 ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. ఆసక్తి గల రైతులు ఏఈవోను సంప్రదించి పూర్తి వివరాలను తెలుసుకోవాలని సూచించారు. రైతు బంధు కో–ఆర్డినేటర్ బద్దం రాజేశ్వర్, పీఏసీఎస్ చైర్మన్ బాపురెడ్డి, ఏవో లావణ్య, హెచ్‌వో సుమన్, తదితరులు పాల్గొన్నారు.

'అవినీతిపై విచారణ జరపాలని డిమాండ్



ఆందోళన చేస్తున్న బీజేపీ నాయకులు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్‌లో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై సిట్టింగ్ జిల్లా జడ్జితో విచారణ జరిపించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, బీజేపీ ఆర్మూర్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ జీవీ నర్సింహారెడ్డి, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి మందుల బాలు డిమాండ్ చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట సోమవారం నాయకులు ధర్నా నిర్వహించి మాట్లాడారు. మున్సిపాలిటీలో జరుగుతున్న అక్రమాలపై ఎన్నిసార్లు అధికారులకు విన్నవించినా స్పందించడం లేదన్నారు. ప్రభుత్వ, నాన్‌లేవుట్, కోర్టు పరిధిలో ఉన్న స్థలాల్లో ఏ అధికారంతో ఇంటినెంబర్‌లు అధికారులు కేటాయించారని ప్రశ్నించారు. అక్రమంగా ఇంటి నెంబర్ కేటాయించిన మేనేజర్‌ను తిరిగి ఇన్‌చార్జి కమిషనర్‌గా పోస్టింగ్ ఇవ్వడం సరికాదన్నారు.

ఎమ్మెల్యేపై వస్తున్న ఆరోపణలపై ఎంక్వైరీ చేయించుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ విషయమై అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు ద్యాగ ఉదయ్, పల్లె శ్రీనివాస్, దొండి ప్రకాష్, ఖాందేష్ ప్రశాంత్, కలిగోట ప్రశాంత్ పాల్గొన్నారు.

మల్లికార్జున్‌పై దాడి పోలీసుల వైఫల్యమే

- రాష్ట్ర పౌర హక్కుల సంఘం నిజనిర్ధారణ కమిటీ ప్రకటన



మాట్లాడుతున్న నిజనిర్ధారణ కమిటీ ప్రతినిధులు

కోటగిరి : ఉపాధ్యాయుడు మల్లికార్జున్‌పై జరిగిన దాడి, మానసిక వేధింపులకు గురి చేసిన ఘటనలో బాధితుడికి రక్షణ కల్పించాల్సిన ప్రభుత్వ సంస్థలు పూర్తిగా వైఫల్యం చెందాయని రాష్ట్ర పౌర హక్కుల సంఘం నిజనిర్ధారణ కమిటీ ప్రతినిధులు వెల్లడించారు. సోమవారం జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించి బాధిత ఉపాధ్యాయుడిని పరామర్శించిన అనంతరం హెడ్ మాస్టర్ గాలప్ప, ఎస్సై మచ్చేందర్ రెడ్డిని కలిసి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడారు. సాక్షాత్తూ ఇద్దరు పోలీసు అధికారులు, గ్రామ సర్పంచ్ సమక్షంలో ఈ ఘటన చోటుచేసుకోవడం బాధాకరమని అన్నారు. నెలసరి వేతనంపైనే ఆధారపడి కుటుంబం మొత్తం బాగోగులు చూసుకునే ఓ సగటు ఉపాధ్యాయుడు ఎంతమందికి చందాలు ఇవ్వగలడని ప్రశ్నించారు. కేవలం గణేష్ చందాల సమయంలో జరిగిన వివాదాన్ని దృష్టిలో ఉంచుకుని కొందరు ఈ దురాగతానికి పాల్పడ్డట్లు తమ విచారణలో తేలిందని పేర్కొన్నారు.

హింసించడం అమానుషం : సీపీఐ

కోటగిరి : ఉపాధ్యాయుడు మల్లికార్జున్‌ను ఘోరంగా హింసించడమే గాక గుడికి తీసుకెళ్లి అవమానాలకు గురిచేయడం సమంజసం కాదని, ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని సీపీఐ కోటగిరి మండల కార్యదర్శి విఠల్ గౌడ్ పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ..మతం ముసుగులో దాడులకు పాల్పడడం దురదృష్టకరమని వాపోయారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు.

దోషులపై చర్యలేవి:ఎస్ఎఫ్ఐ

కోటగిరి : కోటగిరిలో ఉపాధ్యాయుడిపై దాడి ఘటనలో వారం రోజులు గడిచినా కలెక్టర్, పోలీసు అధికారులు స్పందించకపోవడం శోచనీయమని ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు తాటికొండ రవి ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం కోటగిరి హైస్కూల్ ను సందర్శించి మల్లికార్జున్‌ను పరామర్శించారు. జిల్లా అధ్యక్షులు విగ్నేష్, ప్రధాన కార్యదర్శి అనిల్ ఉన్నారు.

రక్షణ కల్పించాలి

కోటగిరి: ఉపాధ్యాయుడు మల్లికార్జున్‌కు ప్రాణహాని ఉందని, పోలీసులు రక్షణ కల్పించాలని మాదిగ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా జనరల్ సెక్రెటరీ కేశపురం రమేష్ విజ్ఞప్తి చేశారు. సెక్యూరిటీ లేకుంటే విధినిర్వహణ అసాధ్యమని అభిప్రాయపడ్డారు. దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

'ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు'



ప్రొసీడింగ్ కాపీని అందజేస్తున్న జీవన్‌రెడ్డి

నందిపేట్(ఆర్మూర్): సీఎం కేసీఆర్ దార్శనిక పాలన వల్ల రాష్ట్రంలోని ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఆర్మూర్ ఎమ్మెల్యే ఏ జీవన్‌రెడ్డి అన్నారు. నందిపేట మండల కేంద్రం పరిధిలోని మున్నూర్‌కాపు, గౌడ, పద్మశాలి, కురుమ సామాజిక వర్గాల కోసం కమ్యూనిటీ ఫంక్షన్ హాళ్లు, ముస్లిం మైనార్టీల షాదీఖాన నిర్మాణ పనులను సోమవారం ఎమ్మెల్యే పరిశీలించి మాట్లాడారు. మూడెకరాల భూమిలో కురుమ సంఘానికి రూ. 50 లక్షలు, పదెకరాల భూమిలో గౌడ సంఘ భవనానికి రూ.50 లక్షలు, పద్మశాలి భవనానికి రూ.50 లక్షలతో ఫంక్షన్ హాళ్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. నందిపేట మండలంలోని వివిధ సామాజిక వర్గాల కోసం ఆరు ఫంక్షన్ హాళ్ల నిర్మాణం చేపడుతున్నామన్నారు. మార్చి నెలఖారు వరకు పనులు పూర్తి చేసి పెళ్లిళ్లు జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. షాదీఖానా నిర్మాణానికి సంబంధించి నిధుల ప్రొసీడింగ్ కాపీని ముస్లింలకు అందజేశారు.

పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి



రుద్రూర్: గత నెలలో ఇచ్చిన హామీ మేరకు పేద మహిళలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని బహుజన మహిళా మండలి సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఉప తహసీల్దార్ జ్యోతికి వినతి పత్రం అందజేశారు.రాజీవ్ నగర్ కాలనీప్రభుత్వ భూమిలో ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. లేనట్టయితే మళ్లీ ఆందోళన చేస్తామన్నారు.

సమాచారం..

నేడు రుద్రూర్‌లో బ్లాక్ కాంగ్రెస్ సమావేశం

రుద్రూర్: మండల కేంద్రంలోని శశిరేఖా గార్డెన్‌లో ఉదయం పదిన్నరకు మంగళవారం హాత్ సే హాత్ జోడో అభియాన్, బ్లాక్ కాంగ్రెస్ కార్యకర్తల సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నట్టు బాన్సువాడ సెగ్మెంట్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇందూర్ చంద్రశేఖర్ తెలిపారు. సమావేశానికి డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి, పీసీసీ నాయకులు తాహెర్ బిన్ హుందాన్, గడుగు గంగాధర్, బాన్సువాడ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కాసుల బాల్‌రాజ్ ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారని పేర్కొన్నారు.